

చేతిలో బెత్తంతో మెయిన్‌గేట్ వద్ద నిలబడి డిగ్రీస్థాయి విద్యార్థులనుకూడా క్రమశిక్షణలో వుంచేవారు. ఆయన చేతిగుండా చాలామంది మేధావులుగా గుర్తించదగ్గ విద్యార్థులు రాణించారు.

# రోశయ్యగారి జ్ఞాపకాలు

## శ్రీ యడ్లపాటి వెంకటరావు

**పార్లమెంటు సభ్యులు**

రోశయ్యగారితో నా స్నేహం చిన్ననాటిది, హైస్కూలులో చదివే రోజుల్లో ఆయన నాకు ఒక సంవత్సరం సీనియరు. ఆయనకు తెలుగు భాషపై ఎనలేని మక్కువ. చిన్ననాటి నుంచి చదువుపట్ల పూర్తి దీక్ష, క్రమశిక్షణతో వేష, భాష, ప్రవర్తనలతో సహా ఆనాటి తెలుగు రచయితల ప్రభావం ఆయనపై పూర్తిగా వుండేది. చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని ఆమూలాగ్రం పఠించి వాడుకలో తు.చ. తప్పకుండ పాటించిన ఘనత ఆయనకే దక్కినది. తెలుగు గ్రంథకర్తలపై ఆయనకున్న అపేక్షకు ఋజువు తమ కుమారులకు చిన్నయసూరి, రామరాజ భూషణుడు అని ఆయన పెట్టిన పేర్లే. SSLC తరువాత మా దార్లు వేరయినప్పటికి, కాలేజీ కార్యక్రమాల్లో ఏకపాత్రాభినయాలు, నాటకాలు, పద్యపఠనం, మొదలైన వాటిలో మేము కలుస్తూ వుండేవారము.

తెనాలిలో ఆవుల గోపాలకృష్ణమూర్తి గారివద్ద నేను అప్రెంటిస్‌గా వున్నప్పుడు రోశయ్యగారు తరచూ గోపాలకృష్ణమూర్తిగారి వద్దకు వచ్చిపోతూ వుండేవారు. వీరిద్దరి పరిచయం ఎలాంటిదో నాకు తెలియనప్పటికి, గోపాలకృష్ణమూర్తిగారి ప్రభావం, రోశయ్యగారిపై బాగా వుండేదని చెప్పవచ్చు.

తెలుగుభాషపై ఆయనకున్న మక్కువను విమర్శనాత్మక దృష్టితో, హేతువాద ధోరణిలో పునః పరిశీలించడం తద్వారా తన వేషధారణను మార్చుకోవడం, ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి పరిచయ ప్రభావంతోనే జరిగినది. గోపాలకృష్ణమూర్తిగారి ఇంట్లో తరచూ జరిగే భాషా గోష్టులకు ఈయన హాజరవుతూ వుండేవారు. అలా అలవడిన ఆయన హేతువాద దృష్టి జె.కె.సి. కాలేజ్, గుంటూరు, ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యేంతవరకూ కొనసాగింది. కాలేజిలో కూడా భాషపట్ల, త్రిపురనేని వంటి పురోగామి రచయితలపట్ల తనకున్న అపేక్షను, వారిద్వారా తాను పొందిన స్ఫూర్తి వివిధ కార్యక్రమాల్లో వ్యక్తమయ్యేది. చేతిలో బెత్తంతో మెయిన్‌గేట్ వద్ద నిలబడి డిగ్రీస్థాయి విద్యార్థులనుకూడా క్రమశిక్షణలో వుంచేవారు. ఆయన చేతిగుండా చాలామంది మేధావులుగా గుర్తించదగ్గ విద్యార్థులు రాణించారు. ఎ.జి.కె.తో పరిచయం వల్ల, ఎం.ఎన్.రాయ్ భావాలు కూడా రోశయ్యగారి వ్యక్తిత్వంలో ఒకభాగం అయ్యాయి. విశ్వమానవ శ్రేయోదృష్టితో డాక్టర్లను, ఇంజనీర్లను, శాస్త్రవేత్తలను తన చేతులమీదుగా, తనవంతు బాధ్యతగా, కృషితో తీర్చిదిద్దిన సార్థకత రోశయ్యగారికి దక్కినది.

*(Recorded on 30th March, 2000, at the residence of Sri Yedlapati Venkat Rao, M.P. Tenali, Gandhi Nagar, in the presence of Sri G. Sita Ramaiah, Sri M.B.P. Rao and Sri Aariz)*



1972, మనుమరాండ్రతో స్వగృహంలో